



కొండ దిగిన కోడి!

- రోజురోజుకూ తగ్గుతున్న చికెన్ ధరలు
- శ్రావణ మాస ప్రభావం అంటున్న వ్యాపారులు

బోధన్ రూరల్, ఆగస్టు 11: శ్రావణ మాసం ప్రభావంతో కోడి కొండ దిగింది. చికెన్ రేటు రోజురోజుకూ తగ్గుతోంది. కొద్ది రోజుల క్రితం కిలో చికెన్ రూ.280 నుంచి రూ.300 వరకు ఉండగా.. ఆదివారం నాటికి రూ.180కి పడిపోయింది. మార్కెట్‌లో స్కిన్‌తో రూ.150 ఉండగా.. స్కిన్ లెస్ రూ.180 ధర పలుకుతోంది. కోళ్ల ఫారాల్లో పరిమితికి మించి కోళ్ల ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో ఒక్కసారిగా చికెన్ ధరలు పడిపోతున్నాయి. కాగా, ఏటా శ్రావణ మాసంలో చికెన్ రేటుతో పాటు, అమ్మకాలు కూడా తగ్గడం సాధారణమేనని వ్యాపారులు చెప్తున్నారు. చికెన్ ధర తగ్గడంతో రోజురోజుకూ గిరాకీ పెరుగుతోందని బోధన్‌కు చెందిన చికెన్ సెంటర్ నిర్వాహకులు తెలుపగా, ధర తగ్గడంతో వారంలో రెండు, మూడు సార్లు తెచ్చుకుంటున్నామని వినియోగదారులు తెలిపారు.

చికెన్ ధర తగ్గుతోంది..

:లక్ష్మి, గృహిణి, బోధన్



ఇటీవల చికెన్ ధర తగ్గడంతో ఆనందంగా ఉంది. వేసవికాలంలో ఎండలు అధికంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం శ్రావణమాసంలో రేట్లు తగ్గడం కాస్త ఊరటనిస్తుంది. శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు, ఉపవాసాలు ఉండడం వల్ల ఎక్కువ నాన్‌వెజ్ కొనలేకపోతున్నాం.

ఉపవాసాలతో కొంటలేం..

:సత్యనారాయణ, బోధన్



శ్రావణ మాసంలో కోడి ధర తగ్గినప్పటికీ ఇంట్లో పూజలు, శ్రావణ ఉపవాసాలు ఉండడంతో ఎక్కువగా కొనలేకపోతున్నాం. ఎప్పటికీ ఇలాగే రేట్లు ఉంటే ప్రజలు ఆనందంగా చికెన్ కొనుగోలు చేస్తారు. శావణమాసంలో కోడి ధర తగ్గడం శుభ సూచికంగా ఉంది.

పల్లెల్లో.. 'పంచాయతీ' సందడి



- స్థానిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు
- ఓటరు జాబితా రూపకల్పనకు ఆపరేటర్లకు శిక్షణ పూర్తి
- బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్న జిల్లా అధికారులు
- గ్రామాల్లో పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు
- ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుపై స్పష్టత కరువు
- జిల్లాలో మొదలైన దావత్‌ల పర్వం

మొన్నటి వరకు గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల హడావిడిలో మునిగితేలిన నాయకులు ఇక గ్రామ పంచాయతీ ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చనే చర్చలు గ్రామాల్లో ఊపందుకోవడంతో ఇప్పటి నుంచే యువతను, గ్రామస్థులను మచ్చిక చేసుకునేందుకు ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. ఫిబ్రవరి 1తో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 11: జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో అందరిచూపు సర్పంచ్ ఎన్నికలపై పడింది. ఇప్పటి వరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఏదో ఒక పార్టీకోసం పనిచేసిన గ్రామస్థాయి నేతలు చాలా మంది ఈ సారి సర్పంచ్ లేదా, ఎంపీటీసీగానో పోటీచేయాలన్న ఉత్సాహంతో ఉన్నారు. దీంతో ఆశావహులు గ్రామాల్లో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రామ పంచాయతీలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండటంతో మళ్లీ పోటీ చేయాలనుకునే ఆశావహులు గ్రామాల్లో ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లకు దగ్గరయ్యేందుకు వివిధ కార్యక్రమాలను చేస్తున్నారు. పండుగలు, వివిధ ముఖ్యమైన రోజుల్లో గ్రామాల్లోనే ఉంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. గత డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగగా ఏప్రిల్ నెలలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు మధ్య ఐదు నెలల వ్యవధిలోనే ఎన్నికలు జరగగా గ్రామాల్లో పండుగ వాతావరణం ఉండేది. వివిధ రాజకీయ పార్టీల నేతలతో గ్రామాల్లో సందడి ఏర్పడింది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వచ్చి రెండు నెలలు గడిచిపోగా ఇప్పుడు మళ్లీ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా రాజకీయ సందడి మొదలైంది.

కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన

సర్పంచుల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారులతోనే పాలన కొనసాగుతోంది. ఇటీవల సీఎం గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులను ఆదేశించడంతో గ్రామస్థాయి నేతలు పోటీకి సిద్ధమవుతున్నారు. గతంలో పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉండగా అప్పుడు గ్రామ పంచాయతీలలో బీఆర్‌ఎస్ నేతలే పైచేయి సాధిస్తూ వచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి సైతం గ్రామస్థాయిలో పార్టీ కోసం కష్టపడిన నాయకులను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకుంటామని బహిరంగంగానే ప్రకటించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కోసం పనిచేసిన నేతలు ఈసారి పంచాయతీ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల ఆశీస్సులు పొందేందుకు హస్తం నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఓటమిపాలైన బీఆర్‌ఎస్ నేతలు సైతం పంచాయతీ ఎన్నికల్లో సత్తాచాటి పూర్వవైభవం కోసం పనిచేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ నేతలు సైతం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు.

ఓటరు జాబితాపై అధికారుల దృష్టి

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఓటరు జాబితా రూపకల్పన కోసం ఇప్పటికే ఆపరేటర్లకు శిక్షణ కోసం ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఇటీవల శిక్షణ ఇచ్చారు. మొదట వార్డుల మ్యాపింగ్, వార్డుల వారిగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ప్రక్రియపై ఇప్పటికే అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా రూపొందించిన అనంతరం జిల్లా పంచాయతీ అధికారులు తుదిజాబితాను ప్రకటించనున్నారు. ఈ జాబితా ఆధారంగానే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. బ్యాలెట్ పద్ధతిన గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకుగాను జిల్లా అధికారులు బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్నారు.

మూడు విడతల్లో ఎన్నికల నిర్వంచే చాన్స్

జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీలు ఉండగా మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. రెవెన్యూ డివిజన్‌ల వారీగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ రెవెన్యూ డివిజన్‌ల వారీగా మూడు విడతల్లో గతంలో నిర్వహించిన విధంగానే ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

రిజర్వేషన్లపై రాని స్పష్టత

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఆశావహుల్లో గందరగోళం నెలకొంది. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన, బీసీలకు ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా రిజర్వేషన్లను ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ చట్టం చేసింది. ప్రస్తుతం బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో బీసీ కులగణన చేపట్టి దాని ఆధారంగా రిజర్వేషన్‌లలో మార్పులు చేయాలని బీసీ సంఘాల నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. అదే విధంగా ఇటీవల సుప్రీం కోర్టు మాదిగలకు ఏబీసీడీ వర్గీకరణకు ఓకే చెప్పడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్‌ల మార్పు జరిగే అవకాశం ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీ కులగణన, రిజర్వేషన్ల మార్పునకు తగిన సమయం లేకపోవడంతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.



ఘనంగా తీజ్ పండుగ

- పాలిటెక్నిక్ మైదానం నుంచి కలెక్టరేట్ వరకు సంప్రదాయ నృత్యాలతో గిరిజనుల ర్యాలీ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 11: గిరిజనుల పండుగ తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున మహిళలు, యువతీ యువకులు గిరిజనుల సంప్రదాయ వేషధారణలో ప్రత్యేక పూజలు చేశారు. జగదాంబమాతకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, యువతులు సంప్రదాయ నృత్యాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. బంజారా, లంబాడి సంస్కృతి సంప్రదాయానికి చాటి చెప్పే పండుగలో అతి ముఖ్యమైనది తీజ్ పండుగ. ఈ పండుగను పెళ్లికాని అమ్మాయిలు శ్రావణ మాసంలో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. నియమ నిష్ఠలతో ఆధ్యాత్మిక గురువైన జగదాంబ మాతా సేవాలాల్ మహరాజ్ ఆశీర్వాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పండుగ సందర్భంగా పాలిటెక్నిక్ మైదానం నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో బంజారాల యువతి, యువకులు, కులపెద్దలు పాల్గొన్నారు.






• నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న బంజారాలు

పాఠశాలలో సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠాపన



ముప్కాల్, ఆగస్టు 11: మండలంలోని ప్రభుత్వ పాఠశాల 1986-87 బ్యాచ్ పూర్వవిద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆలయం నిర్మించి సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు తమవంతు సహాయంగా సరస్వతీ విగ్రహానికి ఏర్పాటుచేయగా ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సరస్వతీ అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగారాం, రిటైర్డు ఉపాధ్యాయుడు విశ్వనాథ్ రెడ్డి, నాయకులు ముస్కు భూమేశ్వర్, శ్రీనివాస్, రాజేశ్వర్, కట్కు రాజేష్, శ్రావణ్‌కుమార్, గాదె శ్రీనివాస్, పద్మలత, వెంకటలక్ష్మీ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి



శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ప్రాజెక్టు అందాలను తిలకించడానికి ఆదివారం భారీగా తరలివచ్చారు. ప్రాజెక్టు అందాలను సెల్ ఫోన్‌లో బంధిస్తూ సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. కొద్ది రోజులుగా ప్రాజెక్టులోకి వరద చేరడంతో జలకళను సంతరించుకుంటుంది.

-మెండోర

• ప్రాజెక్టు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

వసతులు లేక గురుకుల విద్యార్థుల అవస్థలు

పట్టణ శివారులోని పాత భవనంలో కొనసాగుతున్న పాఠశాల

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 11: పట్టణంలోని గ్రామశివారులో గల వేల్పూర్ సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు వసతులు లేక ప్రతీరోజు నానా అవస్థలకు గురవుతున్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో ఉండాల్సిన ఎస్సీ గురుకుల బాలుర పాఠశాల సొంత భవనం లేక గత కొన్నేళ్లుగా ఆర్మూర్ శివారులో గల గురుకుల పాఠశాల పాత భవనంలో వేల్పూర్ గురుకుల పాఠశాల నడుస్తోంది. 90 శాతం సమస్యలతో విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటి వరకు గురుకుల పాఠశాలలో 452మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యబోధన జరుగుతున్న ఉదయం లేచిన నుంచి తెల్లరేవరకు విద్యార్థులు అవస్థలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ క్లాస్‌లు నడుస్తున్న తరుణంలో వేల్పూర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు కూర్చోవడానికి కుర్చీలు లేక, పడుకోవడానికి బెడ్‌లు లేక అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు విద్యబోధన సమయంలో కూర్చోవడానికి బెంచీలు లేకపోవడంతో కింద కూర్చొని క్లాసులను వింటున్నారు. అలాగే కొన్ని క్లాస్‌రూంలకు తలుపులు, కిటికీలకు డోర్‌లు విరిగిపోయి ఉన్నాయి. వర్షాలు పడితే జల్లులు వస్తున్నాయని విద్యార్థులు దుప్పట్లను అడ్డుగా కట్టుకుంటున్నారు. విద్యాబోధన అనంతరం విద్యార్థులకు అదే రూంను పడుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు. ఇటు చదువు కోసం క్లాస్‌రూంతో పాటు హాస్టల్‌గా అదే గదిని వాడుకుంటున్నారు. అలాగే వర్షాలు పడేటప్పుడు రేకుల షెడ్డులతో ఉన్న గురుకుల పాఠశాలలో కొన్ని రూంలలో రేకులు చెడిపోయి వర్షపు నీరు గదులలో పడుతుండడంతో విద్యార్థులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గదులల్లో విద్యుత్ సరఫరా సైతం సరిగా లేదు. అలాగే గదులలో ట్యూబ్‌లు, ఫ్యాన్‌లు సైతం లేవు. ప్రతీ క్లాస్‌రూంలో విద్యాబోధన కోసం ఏర్పాటు చేసిన బోర్డులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఓ క్లాస్ రూంలో బోర్డును నిటారుగా పెట్టి ఉపాధ్యాయుడు బోధనను కొనసాగిస్తుండగా మిగతా క్లాసులలో శిథిలావస్థలో ఉన్న బోర్డులను వినియోగిస్తున్నారు. విద్యార్థులు ఉదయం కాల కృత్యాలు తీర్చుకుందామంటే బాత్ రూంలకు డోర్‌లు లేకపోవడం, ఉన్నవాటికి విరిగిపోయి ఉన్నాయి. రెండు గురుకుల పాఠశాలకు ఒక నీటి బోరు ఉండడంతో మిషన్ భగీరథ ద్వారా నీటిని వినియోగించు కుంటున్నారు. విద్యార్థులకు స్నానాల గదులు లేక నీటి ట్యాంకు వద్దనే పైప్ ద్వారా కొందరు. తాగునీటి నల్లాల వద్ద, మరి కొందరు విద్యార్థులు స్నానాలను చేస్తున్నారు. విద్యార్థులకు దాహం వేస్తే అదే నీటిని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చొరవ తీసుకొని వేల్పూర్ మండల కేంద్రంలో గురుకుల పాఠశాలను నిర్మించాలని లేదా మంచి అద్దె భవనంలోనైనా కొనసాగేలా అనుమతించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. అలాగే కొద్ది దూరంలో ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహానికి కంపౌండ్‌వాల్ నిర్మాణం లేక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గురుకుల పాఠశాలకు వెళ్లే మార్గం గుంతలమయం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


వర్షపు నీరు రాకుండా కిటికీలకు అడ్డంగా పెట్టిన దుప్పటి


గురుకుల పాఠశాలలో తలుపులు లేని బాత్‌రూంలు

ప్రమాదకరంగా మారిన జన్నేపల్లి వాగు బ్రిడ్జి రోడ్డు



గుంతలమయంగా మారిన రోడ్డు

నవీపేట,ఆగస్టు11: మండలంలోని జన్నేపల్లి వాగుపైన ఉన్న బ్రిడ్జి రోడ్డు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జన్నేపల్లి నుండి నందిపేట మండలానికి వెళ్లడానికి ఈ బ్రిడ్జి ప్రధాన వారధిగా ఉంది. జన్నేపల్లి వైపు ఉన్న బ్రిడ్జి రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడగా సంవత్సరం క్రితం రోడ్డుకు ఒక వైపున కొద్దిదూరం వరకు సీసీ రోడ్డును వేశారు. రెండవ వైపున సైతం బ్రిడ్జిపై సీసీ రోడ్డు వేయాల్సి ఉండగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో బ్రిడ్జిపైన ఉన్న రోడ్డుపై వాహనాలు ఒకే వైపున ప్రయాణిస్తుండడంతో తరుచుగా ప్రమాదాలు జరుగతున్నాయి. బ్రిడ్జిపైన రెండవ వైపున సీసీ రోడ్డు వేయకపోవడంతో ఇనుక చువ్వలు బయట తేలడంతో ద్విచక్ర వాహనదారులతో పాటు పాదచారులు గాయాలపాలవుతున్నారు. ఈ విషయంపై వెంటనే ఉన్నతాధికారులు స్పందించి జన్నేపల్లి వాగు బ్రిడ్జిపై సీసీ రోడ్డు ఏర్పాటును పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత రోడ్డు బ్రిడ్జి ఆర్మూర్ సబ్ డివిజన్ కిందికి వస్తుండడంతో ఆర్ అండ్ బీ ఆర్మూర్ డీఈఈ నాందేవ్‌ను ఫోన్‌లో వివరణ కోరడానికి ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు
గడ్డం రాజారెడ్డి మృతి



గడ్డం రాజారెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు11: ప్రముఖ వ్యాపారవేత్త అంకాపూర్ లాలన ఆశ్రమ వ్యవస్థాపకుడు గడ్డం రాజారెడ్డి శనివారం రాత్రి మృతి చెందారు. గడ్డం రాజారెడ్డి ఆర్మూర్ ప్రాంత ప్రజలకు, జిల్లా వాసులకు పైపుల రాజారెడ్డిగా సూపరిచితుడు.ఎన్నో సేవ కార్యక్రమాలకు తనవంతు సహయ సహకారాలు అందించే వారు. గత 15ఏళ్ల క్రితం లాలన వృద్ధాశ్రమం స్థాపించి వృద్ధులకు భోజన వసతితో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆయన మృతి పట్ల ఆశ్ర మంలోని వృద్ధులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆదివారం అంకాపూర్ గ్రామం లోని లాలన ఆశ్రమంలో అంత్యక్రియాలు నిర్వహించారు. అంతకు ముందు మా జీ మంత్రులు, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయ కులు, జిల్లా ప్రముఖులు రాజారెడ్డి భౌతికకా యాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి, ఎ మ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ గడ్డం రాజారెడ్డి సేవలు మరువలేని వన్నారు. వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి ఎన్నో ఏళ్లుగా వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పించారని, తమ ట్రస్ట్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు సహయ సహకారాలు అందజేశారని గుర్తు చేశారు. అంత్యక్రియాల్లో అంకాపూర్ గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకు లు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు లేక గిరిజనల అవస్థలు

● వాగులపై మినీ వంతెనకు రెండు వైపులా అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో ప్రమాదానికి గురవుతున్న తండా వాసులు



మీరీబాయి తండా వద్ద వంతెన వద్ద కోతకు గురైన అప్రోచ్ రోడ్డు

సిరికొండ ఆగస్టు 11:సిరికొండ మండలంలోని వర్జ్యన్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల వాగులపై మినీ వంతెనలకు రెండు వైపులా అప్రోచ్ రోడ్లను నిర్మించాలని గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.తూంపల్లి నుంచి వర్జ్యన్‌తండా, మీరీబాయి తండా మీదుగా సుభాష్ తండా, బాల్‌రాజ్‌నయాక్ తండా నుంచి పాకాల వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు వరకు రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ. నాలుగు కోట్ల నిధులను గిరిజన కార్పొరేషన్ మూడేళ్ల క్రితం మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణం వరజ్యన్‌తండా వరకు పూర్తి చేయించిన అధికారులు అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారనే దానితో పనులను నిలిపివేశారు.మీరీబాయి తండాకు సమీపాన గల వాగుపై ఒకటి, సుభాష్ తండాకు సమీపాన గల వాగుపై మినీవంతెనలు నిర్మించారు. వాస్తవానికి ఈరెండు వాగులపై పైపులతో కాకుండా వెంట్‌లు ఏర్పాటు చేసి కొంత హై లెవల్ వంతెనలు నిర్మిస్తే గిరిజన ప్రజల రాకపోకలకు సులవుగా ఉండేది, ప్రతీ ఏడాది వర్షాలు కురుస్తే చాలు రెండు మినీ వంతెనలకు రెండు వైపులా అప్రోచ్ రోడ్డు రోతకు గురవుతున్నాయి.సుభాష్ తండా వద్ద వంతెనపై నుంచి వరద నీళ్ల ప్రవహించడమే కాదు అటు ఇటురెండు వైపుల రోడ్డు కోతకు గురవుతుంది. పైపుల్లో చెత్త చెదారం తట్టుకుని వంతెన కొంత మేరకు డ్యామేజ్ అయ్యింది.రోడ్డు కోతకు గురవ్వడం వల్ల ప్రజలు ఎటు వైపు వెల్లడానికి వీలు కాకుండా ఉంటుంది.దీనివల్ల తండాల ప్రజలు తూంపల్లి గ్రామానికి రావాలన్న, గ్రామపంచాయతీకి రావాలన్నరాలేని ప్రరిస్థితి ఏర్పడుతుంది. కోతకు గురైన అప్రోచ్ రోడ్లను తండాకు చెందిన గిరిజనులే మట్టి పోసుకుని నడువడానికి అనుకూలంగా రోడ్డును తయారు చేసుకుంటున్నారు.హన్మానాయక్‌తండా నుంచి మీరాబాయితండా మీదుగాసు భాష్‌తండా వరకురోడ్డంతా బురద గుంతలుగా మారుతుంది.వర్షాలు తగ్గుతేనే వారు సుభిక్షంగా నడువగులుగుతారు.గిరిజన ప్రజల పరిస్థితులను అర్ధం చేసుకుని పాలకులు రోడ్డును బాగు చేయడంతో పాటు ఆగిపోయిన తారురోడ్డు నిర్మాణపనులను ప్రారంభించాలని గిరిజనుల కోరుతున్నారు.రెండువాగులపై వంతెనల ఎత్తుపెంచక పోవడంతో రాక పోకలకు ఇబ్బందులు కలిగాయి. ఎత్తు పెంచి నిర్మాంచాలని సుభాష్ తండా,మీరీబాయి తండా ప్రజలు ప్రభుత్వాన్నిస్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కోరుతున్నారు.



సుభాష్ తండా సమీపాన మినీ వంతెన

వరద బాధితుల కోసం నిధి సేకరణ



వరద బాధితుల కోసం నిధులు సేకరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు11: ఇటీవల ప్రకృతి విపత్తుల వల్ల కేరళ రాష్ట్రంలోని వైనాడ్ ప్రాంతంలో అత్యధిక వర్షాల కారణంగా కొండచర్యలు విరిగిపడి వందలాది మంది చనిపోయ్యారని, వేలాది మంది నిరాశ్రయులు అయ్యారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బోధన్ పట్టణంలో కేరళ వరద బాధితుల సహయార్థం వ్యాపారస్తుల నుండి నిధి సేకరించడం జరిగిందన్నారు. వ్యాపారస్తులు తమవంతు సహకారంతో తోడ్పటు అందించి కొంత నగదు అందజేశారన్నారు. జమ అయిన డబ్బులను రాష్ట్ర కమిటీకి అందిస్తామని, కేరళ రాష్ట్రంలోని వైనాడ్ వరద బాధితుల సహయార్థం ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. మండలంలోని పెంటాఖుర్దు, సాలూర, సాలంపాడ్, కల్దుర్కి, రాంపూర్, బండారుపల్లి తదితర గ్రామాలలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రంలోని వైనాడ్ వరద బాధితుల కోసం సహాయ నిధిని సేకరించారు. సీపీఎం పార్టీ బోధన్ కార్యదర్శి ఏశాల గంగాధర్ గ్రామాలలో వరద బాధితుల సహయం కోసం నిధిని సేకరించామని అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు చాంద్, అంజని, రేఖ, శివలింగం రాములు, పోశవ్వ, నాగమణి, శేషబాయి, గైని రాములు, రాంపటేల్, సాయినాథ్, చింటు, ఎల్లయ్య, పోచవ్వ, భూమవ్వ, సావిత్రి, మహిపాల్, భూమవ్వ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట రక్షణకు రైతుల యత్నాలు



వేల్పూర్‌లో మొక్కజొన్న పంట చుట్టు వైర్లు చుట్టిన దృశ్యం



పచ్చలనడ్కుడలో మొక్కజొన్న పంట చుట్టు కట్టిన పాత చీరలు

వేల్పూర్, ఆగస్టు11: పంట విత్తనం నాటి నుంచి చేతికందే వరకు రైతులు అష్టకష్టాలు పడుతుంటారు. మండలంలోని పలు గ్రామాలలో ప్రస్తుతం అడవి పందుల బారి నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు పలు విధాల సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటపై అడవి పందుల బెడద ఎక్కువ ఉన్న వాటి బారి నుంచి పంటను రక్షించుకోవడానికి పాత చీరులు, వైరు తీగెలు, ప్లాస్టిక్ తీగలు, పగ్గాలను పంట చుట్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రక్షణ చర్యలు చేపట్టడం వల్ల అడవి పందుల బెడద తగ్గే అవకాశం ఉందంటున్నారు రైతులు. అడవి పందులు రాత్రి వేళల్లో పంటపై దాడి చేసే సమయంలో చీరలు, వైర్లు, నైలాన్ పగ్గాల స్పర్శ తగిలి వ్యక్తులు ఉన్నట్లుగా భావించి భయాందోళనతో అడవి పందులు పంటలోకి రాకుండా ఉంటాయని రైతులు బావిస్తున్నారు.. రైతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంట రక్షణ చర్యల వల్ల అడవి పందులు పంట లోపలికి ప్రవేశించకుంటా ఇలాంటి చర్యలు చేపట్టడం వల్ల పంట నష్టం జరగదని రైతులు భావిస్తున్నారు.

కుంగిన సిమెంట్ రోడ్డుకు మరమ్మతులు కరువు



సిమెంట్ రోడ్డుపైన ఏర్పడిన పగులను చూపుతున్న కాలనీవాసులు

మోస్రా,ఆగస్టు11: మండల కేంద్రంలో పలు కాలనీలలో సిమెంట్ రోడ్డు పరిస్థితి దుర్భరం ప్రభుత్వం లక్షలు పెట్టి రోడ్డు వేయమని నిధులు మంజూరు చేసి కాంట్రాక్టు ఇస్తే సదరు కాంట్రాక్టర్ రోడ్డు మాత్రమే వేసి రోడ్డు కుంగిపోకుండా రోడ్డుకు ఇరువైపులా మొరం మట్టి వేయకుండా వదిలేయడంతో రోడ్డు పొడవునా పగుళ్లు వచ్చి రోడ్డు వేసి కనీసం సంవత్సరం గడవకముందే కుంగిపోయి పగిలి ఏర్పడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు.మరో చోట రోడ్డు పొడవున దాదాపు పది మీటర్ల పొడవు పగిలిపోయిన దృశ్యం చూడవచ్చు. రోడ్డు వేసి పక్కన కాలనీ ఇళ్లలోకి చిన్నపిల్లలు, ముసలి వయసు ఉన్నవారు వెళ్లేందుకు చాలా ఇబ్బంది ఉంది రాత్రివేళల్లో ఈ రోడ్డు వెంబడి వెళ్తుంటే చాల సార్లు ఆ సిమెంట్ పగుళ్లలో కాలు, మోటారు వాహనాల టైర్లు ఇరుకుని పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉన్నతాధికారులకు విన్నవించిన ఫలితం లేక పోయింది. ఇంత దీనస్థితిలో బతుకుతున్న సంబంధించిన అధికారులు మొరం మట్టి కూడా వేయించలేక పోతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారి ఏఈకి వివరణ అడిగి నాడు ప్రచురించిన వార్తలో పగుళ్లు కేవలం ఎయిర్ క్రక్ అని బదులిచ్చారు. ఇప్పుడు రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతున్న మరి ఇప్పుడు అయినా పట్టించుకుంటారా అని ఎదురుచూస్తున్న కాలనీవాసులు మండలంలో విచ్చలవిడిగా మొరం తవ్వకాలు జరుగుతున్న మా పరిధిలోకి రాదన్నారు. రెవెన్యూ అధికారులు కనీసం గ్రామాభివృద్ధిలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొరం మట్టివేస్తే బాగుంటుందని గ్రామస్థులు అభిప్రాయం.

త్వరలో పని పూర్తి చేస్తాం

● మండల ప్రత్యేక అధికారి రమేష్

రోడ్డుకు ఇరువైపులా మట్టివేయక రోడ్డు ధ్వంసం అవుతున్నాయి నిజమే. సదరు కాంట్రాక్టు పీఆర్ఏఈలతో మాట్లాడి పని పూర్తి చేయిస్తాం.

మొరం వేస్తే నడవడానికి వీలుంటది

రోడ్డు పక్కన మట్టి వేయక రోడ్డు ఎత్తు పెరిగి కిందకి దిగలేక రోడ్డు ఎక్కలేక ఇబ్బంది పడుతున్నాం. మట్టి వేయక రోడ్డు మొత్తం పగిలిపోయింది. సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మత్తులు చేయండి.

- లక్ష్మీ, కాలనీవాసి

20వ వార్డులో పార్కు మాయం

● కబ్జాకు గురవుతున్న పార్కు స్థలం



పార్కులో ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్న దృశ్యం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు11: పట్టణంలోని 20వ వార్డులో వెంకటేశ్వర ఆలయం (కుక్కలగుట్ట) వెనుక గల పార్కు మయమైంది. గత ప్రభుత్వ పాలనలో లక్షలు ఖర్చు చేసి పది శాతం స్థలాల్లో పార్కును ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. కానీ కొందరు కబ్జాదారులు అట్టి స్థలాన్ని కబ్జా చేయాలనే ఉద్దేశంతో అందులోని మొక్కలను తొలగించి కనబడకుండా చేశారు. పట్టణ ప్రగతిలో భాగంగా పది శాతం స్థలానికి పెన్సింగ్ చేసి బోర్డును ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం బోర్డు చినిగిపోగా పెన్సింగ్ కనబడడంలేదు. పార్కు పక్కనే నిర్మితమవుతున్న గృహానికి సంబంధించిన ఇసుక, సలకలు అందులోనే ఉన్నాయి. ఇంత జరుగుతున్న మున్సిపల్ అధికారులు నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహారిస్తూ ఒక్కసారైన పర్యవేక్షించిన దాఖలాలు లేవు. దీంతో అధికారుల కనుసన్నల్లో కబ్జాకు గురవుతుందని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు వస్తే తప్ప మున్సిపల్ అధికారులు స్పందించపోవడం సిగ్గుచేటని, ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ఇట్టి స్థలాన్ని కబ్జాకు గురికాకుండా మొక్కలను తొలగించి స్థలాన్ని ఉపయోగించుకుంటున్న కబ్జాదారుల నుంచి కాపాడి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ సభ్యుడు

పెర్కిట్, ఆగస్టు11: ఆటోడ్రైవర్‌లకు సంవత్సరానికి రూ.12వేలు ఇచ్చి ఆదుకుంటామని చెప్పిన రాష్ట్రప్రభుత్వం హామీలు అమలు చేయడంలేదని, తక్షణమే ఆటోడ్రైవర్‌లు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని మిలాన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆటోడ్రైవర్‌లు, ఏఐటీయూసీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి ఇద్దరు చొప్పున 60 మందితో ఆర్మూర్ డివిజన్‌లో నూతన కమిటీతో పాటు 20మంది యాక్షన్ కమిటీని ఎన్నుకుంటామని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, లేని యేడల ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లిసాయిలు,సభ్యులు సుబాష్, శ్రీనివాస్, గురువయ్య, రమేష్, రాజేశ్వర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామంలో సౌకర్యాలు కరువు



చీకట్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎడపల్లి, ఆగష్టు11: ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామంలో శనివారం రాత్రి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందగా అతని అంత్యక్రియలు అంధకారం నడుమ కొనసాగాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఎన్నో లక్షలు వెచ్చించి వైకుంఠధామాలు నిర్మిస్తే అవి నేటికీ కనీస మౌళిక సదుపాయాలకు నోచుకోక పోతున్నాయి. అందుకు నిదర్శనం ఠాణాకలాన్ గ్రామంలో శనివారం రాత్రి చీకట్లో జరిగిన అంత్యక్రియలే సాక్ష్యం. గ్రామానికి చెందిన ఇందూరి గణపతి(55) శనివారం మధ్యాహ్నం సమయంలో అలీసాగర్ శివారు ప్రాంతంలో అకస్మాత్తుగా గుండుపోటుతో మృతి చెందాడు. అయితే అతని అంత్యక్రియలు కుటుంబ సభ్యులు అదే రోజు నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రివేళ అడవి ప్రాంతంలో ఉన్న వైకుంఠధామంలో చిమ్మ చీకట్లో అంత్యక్రియలు నిర్వహించారు. లక్షలు వెచ్చించి వైకుంఠధామాలు నిర్మించి విద్యుత్తు సరఫరా ఏర్పాటు చేయక పోవడంతో చీకట్లోనే భయంతో అంత్యక్రియలు చేయాల్సి వచ్చింది. వైకుంఠధామంలో మౌళిక వసతులు కల్పించకుండా నిధులు దుర్వినియోగం చేశారని ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామంలో సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్

జక్రాన్‌పల్లి, ఆగస్టు11: అప్పుల బాధతో ఆత్మహత్య చేస్తున్న జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామానికి చెందిన రైతు కుంట రాజేష్ కుటుంబానికి న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. ఆదివారం అర్గుల్‌లో రైతు రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు. అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి అప్పులు చెల్లించాలని కుంట రాజేష్‌ను ఇబ్బందులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు కుటుంబానికి ప్రభుత్వ రైతు బీమా ఇవ్వాలన్నారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు పెట్టిన సహకరించలేదని అప్పులు పాలయ్యారని అన్నారు. ప్రభుత్వం రైతు కుంట రాజేష్ కుటుంబాన్ని రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూమన్న, నాయకులు ఎర్రన్న, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు : ఎస్సై

బోధన్‌రూరల్,ఆగస్టు11: పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ అన్నారు. ఆదివారం బోధన్ మండలంలోని చిన్నమావంది గ్రామంలో రహస్య ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఏడుగురికి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1200 స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రజలు పేకాట ఆడి చెడు వ్యసనాలకు లోనై డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. పేకాట ఆడిన, నిర్వహించిన, పేకాట ఏర్పాటు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇచ్చిన మాట నిలుపుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

డిచ్‌పల్లి, ఆగస్టు 11: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్, ఘన్‌పూర్, నడిపల్లి, రాంపూర్ గ్రామాల లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ఆర్థిక లోపాలతో సతమతమవుతున్న ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు వెళ్తుందని హామీల అమలే ప్రభుత్వ ధ్యేయమన్నారు. త్వరలోనే కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం అందజేస్తామని, మంచిప్ప రిజర్వాయర్ ద్వారా ఆయకట్టు పరిధిలోని రైతాంగానికి త్వరలోనే సాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐడీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు దత్తాద్రి, భాస్కర్, నారాయణ రెడ్డి, కంచెట్టి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

భారీగా నల్ల బెల్లం పట్టివేత



నల్ల బెల్లంను పట్టుకున్న పోలీసులు

ఖిల్లా, ఆగస్టు 11: రైలులో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక సంచులను ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరెడ్డి ఆధ్వర్యంలో 17057 నెంబర్‌గల రైల్‌లో తనిఖీలు చేయగా అనుమానాస్పదంగా ఉన్న సీటు కింద పరిశీలించారు. వారికి అక్కడ మూడు నల్లబెల్లం సంచులు,ఏడుపటిక సంచులు గుర్తించారు.వాటి విలువ సుమారు రూ.19, 600 ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం ఆర్‌పీఎఫ్ పోలీసులకు వీటిని అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు.

ధర్పల్లిలో పందుల స్వైర విహారం



ధర్పల్లి బీసీ కాలనీలో సంచరిస్తున్న పందులు

ధర్పల్లి, ఆగస్టు 11: మండల కేంద్రంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ధర్పల్లి గ్రామంతో పాటు బీసీ కాలనీలో పందుల వల్ల గ్రామస్థులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందులు గుంపులు గుంపులుగా తిరగడం వల్ల చిన్న పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. పందుల వల్ల గ్రామంలో అశుభ్రత వాతావరణం నెలకొంటుంది. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడటంతో పాటు అనారోగ్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు పందుల యజమానులను కట్టడి చేయాలని కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పందులను గ్రామంలో తిరగనివ్వకుండా చూడాలని కోరుతున్నారు.

పిచ్చికుక్క దాడిలో 9 మందికి గాయాలు

ఆర్మూర్‌రూరల్,ఆగస్టు11: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం పిచ్చి కుక్క స్వైర విహారం చేయడంతో తొమ్మిది మంది గాయాలపాలయ్యారు. ఉదయం తమ ఇళ్ల ముందు వాకిలి ఊడుస్తున్న మహిళలతో పాటు పలువురిని పిచ్చి కుక్కలు కరిచింది. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరిని వైద్యుల సిఫార్సు మేరకు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గత కొంత కాలంగా గ్రా మాలలో కుక్కల బెడద ఎక్కువైంది గ్రామస్థులు వాపో యారు. అధికా రులు స్పందించి కుక్కల ను నియం త్రించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

● బ్రహ్మకుమారీలతో రాఖీ కట్టించుకున్న అర్బన్ ఎమ్మెల్యే



నగరంలో రాఖీ కట్టించుకుంటున్న ఎమ్మెల్యే

పెద్దబజార్, ఆగస్టు 11: అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగని అది మన గొప్ప సంస్కృతి మన దేశంలోనే ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని ఏడోడివిజన్‌లో శాంతిభవన్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదరభావానికి ప్రతీకంగా భారతదేశం అంతటా జరుపుకునే రాఖీ పండుగ ఆనవాయితీగా వస్తోందని భారతదేశానికి గొప్ప చరిత్ర ఉందని భారతీయులంతా నాసోదరీమణులంటూ పరాయి స్త్రీని కూడా అక్కగా చెల్లిగా చూసే గొప్ప సంస్కృతి అని అన్నారు. అక్కాచెల్లెల్ల కోసం అన్న దమ్ములు రాఖీలు కట్టుకోవడానికి ఆనవాయితీగా వస్తుందన్నారు. చిన్నప్పటి నుంచి పిల్లల్లో సోదరభావాన్ని, దేశభక్తిని నింపే ఇలాంటి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి భవన్ సభ్యులు బి.కె.వనజ, బి.కె.సుజాత, బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, ఏడో డివిజన్ కార్పొరేటర్ సుక్కమధు, బీజేపీ నాయకులు పల్నాటి కార్తిక్, శేఖర్, కిశోర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

● సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్



మాట్లాడుతున్న తారాచంద్‌నాయక్

డిచ్‌పల్లి, ఆగస్టు 11: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని రైతుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారాచంద్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని రాంపూర్ విండో పరిధిలోగల ఏడు గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా రైతువేదికలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను 1995 నుంచి సహకార సంఘంలో పనిచేస్తున్నానని డైరెక్టర్‌గా,రాంపూర్ విండో చైర్మన్‌గా, ప్రస్తుతం ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా తనకు అందరి సహకారంతో పదవులు దక్కాయని పేర్కొన్నారు.చెదలు పట్టిన సహకార సంఘాలను బలోపేతం చేయడమే తనముందున్న కర్తవ్యమని నిస్వార్థంగా సేవ చేసి ఐడీసీఎంఎస్ పరిధిలోగల 4లక్షల రైతాంగానికి ఎల్లప్పుడూఅందుబాటులో ఉంటానని అన్నారు. రాంపూర్ గ్రామంలో త్వరలోనే రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మార్కెట్ యార్డు నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపూర్ గ్రామ రామకృష్ణారెడ్డి కాంస్య విగ్రహాన్ని రాంపూర్‌లో నెలకొల్పేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఐడిసిఎంఎస్ చైర్మన్‌గా పదవి రావడానికి కృషి చేసిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, బోధన్‌శాసనసభ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ శాసనసభ సభ్యుడు భూపతిరెడ్డిల సహకారాన్ని తాను ఎన్నటికి మర్చిపోలేనని పేర్కొన్నారు. ఈసన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిదులు కంచెట్టి గంగాధర్, ముల్లంగి నర్సయ్య, పొలసాని శ్రీనివాస్, పెద్దోళ్ల శ్రీనివాస్, అబీబ్ ఖాన్,గాంధారిరాజు,వడ్లగంగాధర్,రాంసింగ్,బలరాం నాయక్, రైతులు పాల్గొన్నారు.

పంట రక్షణకు రైతన్న తంటాలు

ముప్కాల్, ఆగస్టు11: వర్షాకాలం పంట రక్షణకు రైతున్నలు నానా తంటాలు పడుతున్నారు. మొక్కజొన్న పంటను కాపాడుకోవడానికి రైతన్నలు రాత్రింబవాళ్లు కష్టపడుతున్నారు. ఒక్కో రైతు ఒక్కో విధంగా తమ పంటను కాపాడుకోవడానికి చిన్న పాటి ప్రయోగాలు చేస్తున్నారు. పంటను కాపాడడానికి రైతులు చీరలు, వైర్లు, గాలికి చేసే శబ్దం తదితర వస్తువులను కీటకలు పక్షులు, అడవి పం దుల బాధ నుంచి రక్షించుకుం టున్నారు. దీంతో చూపరులను ఆకట్టుకుంటుంది. బాల్కొండ మండ లం చిట్టాపూర్ శివారు ప్రాంతంలో పంట పొలాల్లో అనిత అనే మహిళ రైతు గాలికి శబ్దం వేసే గంట పంట చుట్టుగా చీరలు ఏర్పాటు చేసిన తీరుపై అందరు ప్రశంసిస్తున్నారు.



చిట్టాపూర్‌లో గాలికి వీస్తే శబ్దం వచ్చేలా ఏర్పాటు చేసిన పరికరం

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేందర్



సన్మానిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, ఆగస్టు 11: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిజామాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇంజ సురేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నాచారంలో జరిగిన హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈకమిటీలో జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఇంజ సురేందర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావ డం పట్ల అసోసియేషన్ అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సం ఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

జెండా బాలాజీ ఆలయంలో విష్ణుయాగం



గరుఢ ప్రసాదాన్ని అందజేస్తున్న వేదపండితులు

పెర్కిట్, ఆగస్టు11: ఆర్మూర్ పట్టణంలోని జెండాగల్లీలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రియహ్నిక విష్ణుయాగం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా బాలాజీ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో హోమం, దీపరాధన నిర్వహించి బాలా జీ జెండాకు ప్రత్యేక పూజలు నిర్వ హించి మహిళలకు గరుఢ ప్రసాదం అందజేశారు. ఆలయంలో గత 20ఏళ్లుగా నారాయణచారి ఆధ్వర్యంలో పిల్లలు లేని మహిళలకు గరుఢ ప్రసాదాన్ని అందజేస్తు న్నామని తెలిపారు.

జూన్, జూలై విద్యుత్ శాఖ ఉత్తమ ఉద్యోగులు

సుభాష్‌నగర్, ఆగస్టు 11: నూతన సిఎండీ వరుణ్‌రెడ్డి ఉద్యోగులు శక్తివంచన లేకుండా పని చేయడం కోసం ఉత్తమ ఉద్యోగుల అవార్డులను ప్రకటిస్తున్నారు. ఇందులో భాగంగా జూన్, జూలై మాసానికి సంబంధించి ఉత్తమ ఉద్యోగులను ఆదివారం ప్రకటించారు. రూరల్, అర్బన్ వేరువేరుగా తీసుకొని ఇరు ప్రాంతాలకు ఉత్తమ ఉద్యోగులను ప్రకటిస్తూ వారిని మరింత పనిచేసేలా ఉత్సాహం కల్పిస్తున్నారు. జూన్, జూలై మాసానికి ఉత్తమ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా రవీందర్, డీఈలుగా హరిచంద్రనాయక్, శ్రీనివాస్, ముక్తార్, ఏడీఈలుగా తోటరాజశేఖర్, అశోక్‌కుమార్, సుహాసిని, ఏఈలుగా నాగేష్, ఎండీ అజర్, బెనర్జీ, సత్యప్రసాద్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, గంగాశేఖర్, సుమిత, నందిపేట్ ఏఈ ఎం.అశోక్, ఎంఎ రూఫ్‌లను ఉత్తమ అధికారులుగా ప్రకటించారు. ఈ అవార్డులు మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ఉపయోగపడుతాయని ఉత్తమ అవార్డు గ్రహితలు అన్నారు.

మొరం టిప్పర్ పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన మొరం టిప్పర్

నవీపేట,ఆగస్టు11: మండల కేంద్రంలోని రైల్వే గేట్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మండలంలోని ఫత్తేనగర్ శివారు నుండి నవీపేట రైల్వే గేటు సమీపంలో ఉన్న బర్కత్‌పుర కాలనీకి అక్రమంగా మొరాన్ని తరలిస్తుండగా సంబంధిత టిప్పర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న మొరం టిప్పర్‌ను మైన్స్ అధికారులకు అప్పగించడం జరుగుతుందని ఆయన వివరించారు. అక్రమంగా మొరాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవీపేట,ఆగస్టు11: మండలంలోని నాళేశ్వర్ నుండి నవీపేటకు అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. నాళేశ్వర్ నుండి నవీపేటకు ఇసుక అక్రమంగా తరలిస్తుండగా శనివారం రాత్రి జన్నేపల్లి సమీపంలో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదకరంగా తాగునీటి సంప్



పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా తాగునీటి సంప్ ఇదే..

కోటగిరి,ఆగస్టు11: పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్యను తీర్చేందుకు గత ప్రభుత్వం మన ఊరు, మన బడి పథకం కింద నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంప్ అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రమాదం సంభవిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోని ప్రాథమిక పాఠశాలలో ఈ సమస్య నెలకొని ఉంది. గత ప్రభుత్వ హయంలో పాఠశాలకు మన ఊరు, మన బడి పథకం కింద రూ.7లక్షల మంజూరయ్యాయి. ఈ నిధులతో సంప్ నిర్మాణం, విద్యుత్ పనులు, ఇతరత్రా పనులు చేపట్టాల్సి ఉంది. గతంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సంప్ నిర్మాణానికి గుంత తీసి సీసీ పనులు చేపట్టారు. సీసీ పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలివేయడం గమనార్హం. రెండేళ్ల నుంచి పనులు పూర్తి చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీపైభాగంలో ఇనుప చువ్వలు ఉండడంతో విద్యార్థులు అందులో పడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కనీసం గుంతను పూడ్చివేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమస్యపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే నిలిపివేశారన్నారు. ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. పనులు పూర్తి చేసి విద్యార్థులకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఎంతైన ఉంది.

మహిళల సమస్యలపై పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సరిత

పెద్దబజార్,ఆగస్టు11: జిల్లాలో మహిళలు ఎదు ర్కొంటున్న సమస్యలపై పోరాడాలని పీవోడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరిత అన్నారు. ఆదివారం నగరంలోని ద్వారకా నగర్‌లోగల ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మనోవాద భావజాలానికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. మద్యానికి వ్యతిరేకంగా అశ్లీల సాంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అనంతరం ప్రగతిశీల మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.అధ్యక్షురాలిగా ఆకుల అరుణ, ఉపా ధ్యక్షుడు లక్ష్మి, సునీత, ప్రధాన కార్యదర్శి భారతి, సహాయ కార్యదర్శులు పుష్పలత, లాస్య, కోశాధికారి సంజన,జిల్లా కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి,చిట్టెక్క,పద్మ,వేల్పూర్ లక్ష్మి,దేశెట్టి రాధా, నీలం లక్ష్మి,మహ్మద,లక్ష్మి, స్వప్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ఖిల్లా, ఆగస్టు 11: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. ఆనంద్‌నగర్‌కు చెందిన కమల్‌సింగ్ (40) గుర్తుతెలియని మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఐదోటౌన్ ఏఎస్సై జి.గంగాధర్ తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం తల్లిదండ్రుల వద్దకు వచ్చిన మృతుడు మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందినదని ఆమె వచ్చిన తర్వాత ఫిర్యాదు తీసుకొని కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పొతంగల్‌లో చెక్‌పోస్టు ఏర్పాటు

కోటగిరి,ఆగస్టు11: పొతంగల్ మండల కేంద్రంలోని మంజీర నది బ్రిడ్జి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్ సమన్వయంతో చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.